శని వారం
23-12-2023
సంపుటి - 08,
సంచిక - 414
పేజీలు - 4
వెల రూ. 5/-
Telangana
Andhra Pradesh
CEO & Editor : G. PRUDHVIRAJ
RNI NO: TELTEL/2016/73311
www.samasamajam.in
# సమ సమాజం
SAMA SAMAJAM TELUGU DAILY
తెలుగు వార్త పత్రిక
Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

## రాహుల్ గాంధీపై చర్యలు తీసుకోండి

### ఎన్నికల సంఘాన్ని ఆదేశించిన ఢీల్లీ హైకోర్టు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 22 (సమ సమాజం):** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మరోసారి చిక్కుల్లో పడ్డారు. ప్రధానిపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై ఎనిమిది వారాల్లోగా చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని దిల్లీ హైకోర్టు ఆదేశించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్ష్యంగా అనుచిత వ్యాఖ్యలు చేయడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కి జారీ చేసిన నోటీసులపై ఎనిమిది వారాల్లో చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘానికి దిల్లీ హైకోర్టు ఆదేశించింది. రాహుల్ గాంధీ వ్యాఖ్యలు

4వ పేజీలో...

## పాఠశాలలకు క్రిస్మస్ సెలవులు

**హైదరాబాద్, డిసెంబర్ 22 (సమ సమాజం):** క్రిస్మస్‌ను పురస్కరించుకుని శనివారం నుంచి పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. క్రిస్మస్ పండుగ, బాక్సింగ్ డే, క్రిస్టమస్ టైడ్ రెండు రోజు సెలవులను హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని ఇతర జిల్లాల్లోని పాఠశాలలకు ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వ కార్యాలయాలు కూడా క్రిస్మస్, బాక్సింగ్ డేలకు సెలవులు పాటించనున్నాయి. తెలంగాణ రాష్ట్ర పోర్టల్ క్యాలెండర్ 2023 ప్రకారం, డిసెంబర్ 25, 26 తేదీలలో క్రిస్మస్, బాక్సింగ్ డేలకు సెలవులు ఉంటాయి. ఈ రోజులు 'సాధారణ సెలవులు' కింద జాబితా చేయబడ్డాయి. అయితే బ్యాంకులు ఒక్కరోజు మాత్రమే మూతపడనున్నాయి. కాగా, తెలంగాణ ప్రభుత్వం జనవరి 1న నూతన సంవత్సరం సందర్భంగా సెలవు ప్రకటించింది

## ప్రజావాణికి వెల్లువెత్తిన ఫిర్యాదులు

### ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని హోంగార్డుల వినతి



**హైదరాబాద్, డిసెంబర్ 22 (సమ సమాజం):** ప్రజాభవన్‌లో చేపట్టిన ప్రజావాణి కార్యక్రమం శుక్రవారం ఉదయం ప్రారంభమైంది. ప్రతి మంగళ, శుక్రవారం ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తోంది. ప్రజా సమస్యలపై దరఖాస్తులు స్వీకరించేందుకు తెలంగాణ సర్కార్ నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి భారీ స్పందన లభిస్తోంది. ప్రజా భవన్‌లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పింఛన్లు, ఇళ్లు, ఉద్యోగాలు ఇప్పించాలని పెద్ద ఎత్తున వచ్చిన జనాలు తమ సమస్యలపై అధికారులకు ఫిర్యాదులు అందజేస్తున్నారు. హోంగార్డులకు సంబధించి 250 మంది తమ సమస్యను ప్రజాభవన్‌లో అధికారులకు విన్నవించుకునేందుకు వచ్చారు. ఈ సందర్భంగా వారు ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. 250 మంది హోంగార్డులం ఉమ్మడి

2వ పేజీలో...

# సేవ్ డెమోక్రసీ..

## ఎంపీల మూకుమ్మడి సస్పెన్షన్లపై ధర్నా

- జంతర్‌మంతర్ వద్ద 'ఇండియా' కూటమి నిరసన
- ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందన్న నేతలు
- భద్రతా వైఫల్యంపై ప్రభుతంపై విమర్శలు
- భాజపా ఎంపీలు పారిపోయారు: రాహుల్ గాంధీ
- రాజ్యాంగ విధులను నిర్వర్తించడంలో వారు విఫలం
- ఎంపీల సస్పెన్షన్‌పై ఖర్గే తీవ్రవిమర్శలు




**న్యూఢిల్లీ, డిసెంబర్ 22 (సమ సమాజం):** పార్లమెంటులోకి దుండగులు చొరబడిన ఘటనపై ప్రశ్నించిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులను పెద్ద సంఖ్యలో సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ.. 'ఇండియా' కూటమి దేశవ్యాప్త ఆందోళనలకు పిలుపునిచ్చింది. దీనిలో భాగంగా శుక్రవారం దిల్లీలోని జంతర్‌మంతర్ వేదికగా విపక్ష నేతలు నిరసనలో పాల్గొన్నారు. సేవ్ డెమోక్రసీ పేరిట ఈ కార్యక్రమం చేపట్టారు. భద్రతా వైఫల్యంపై కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రకటన చేయాలని విపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. దాంతో ఉభయ సభల కార్యకలాపాలకు అంతరాయం కలిగిస్తున్నారంటూ సభాపతులు విపక్ష ఎంపీలపై వేటువేశారు. మొత్తం 146 మంది ఎంపీలు సస్పెండ్ అయ్యారు. ఈ మూకుమ్మడి సస్పెన్షన్లపై తీవ్ర నిరసన వ్యక్తమైంది. ఈ క్రమంలోనే జంతర్‌మంతర్ వద్ద విపక్ష పార్టీలకు చెందిన నేతలు ఆందోళన చేపట్టారు.

4వ పేజీలో...

## 2024 గగన్‌యాన్‌కు ఇస్రో సంసిద్ధత

### మానవరహిత విమాన పరీక్షలకు సిద్ధం ● ఇస్రో ఛైర్మన్ సోమ్ నాథ్ వెల్లడి



**బెంగళూరు, డిసెంబర్ 22 (సమ సమాజం):** 2024లో గగన్ యాన్ మిషన్‌కు అంతా సిద్ధం చేస్తున్నట్లు ఇస్రో ఛైర్మన్ సోమ్‌నాథ్ తెలిపారు. క్రూ ఎస్కేప్ సిస్టమ్ మానవ రహిత విమాన పరీక్షలకు ఇస్రో సిద్ధమవుతోంది. మొదటి డెవలప్ మెంట్ ఫ్లైట్ టెస్ట్ వెహికల్ తయారీ చివరి దశలో ఉన్నందున గగన్ యాన్ మిషన్ కోసం మానవ రహిత విమాన పరీక్షలను త్వరలో ప్రారంభిస్తామని భారత అంతరిక్ష సంస్థ ఇప్పటికే ప్రకటించింది. గగన్ యాన్ ప్రాజెక్ట్ లో భాగంగా భూమికి 400 మీటర్ల ఎత్తులో ఉన్న వృత్తాకార కక్ష్యలోకి ఇద్దరు లేదా ముగ్గురు సభ్యులతో కూడిన సిబ్బందిని ఇస్రో ప్రవేశపెట్టనుంది. ఈ

4వ పేజీలో...

## ఆర్టీసీకి పెరిగిన మహిళా ప్రయాణికులు

### ఉచిత ప్రయాణాలతో బస్సులన్నీ కిటకిట

### పలు రూట్లలో బస్సులు లేక అద్దెబస్సులకు ఆఫర్




**హైదరాబాద్, డిసెంబర్ 22 (సమ సమాజం):** తెలంగాణ ఆర్టీసీపై మహిళల ఉచిత ప్రయాణ ప్రభావం పడింది. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిలళకు ఉచిత బస్ ప్రయాణం ప్రారంభమైన రోజు నుంచి రాష్ట్ర వ్యాప్తంగా భారీగా

4వ పేజీలో...

## దేశంలో అరాచక పాలన

### ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బిజెపి

### దేశాన్నికాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదీ

### ఇందిరాపార్క్ వద్ద ధర్నాలో డిప్యూటి సిఎం భట్టి



**హైదరాబాద్, డిసెంబర్ 22 (సమ సమాజం):** దేశంలో బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని అన్నారు. పార్లమెంటులో ప్రతిపక్ష ఎంపీల సస్పెన్షన్‌ను నిరసిస్తూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ దగ్గర ఇండియా కూటమి శుక్రవారం ధర్నా నిర్వహించింది. ఈ ధర్నాలో భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియంతృత్వ పోకడలతో మోదీ పాలన కొనసాగుతోందని అన్నారు.దేశంలో అసలు ప్రజాస్వామ్యం ఉందా అని ప్రశ్నించారు. దేశంలో స్వేచ్ఛగా మాట్లాడే హక్కు లేదని.. ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం దుర్మార్గమైన చర్య అని

4వ పేజీలో...

## గతేడాదికన్నా 2శాతం పెరిగిన నేరాలు

### హత్యలు తగ్గినా..పెరిగిన స్థిరాస్థి కేసులు

- మహిళలపై పెరిగిన అఘాయిత్యాలు
- రాత్రి 1గంట వరకే న్యూఇయర్ వేడుకుల
- తాగి దొరికితే డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు
- పబ్బులకు తిరిగి అనుమతించే ప్రసక్తి లేదు
- డ్రగ్స్ వినయోగంపై ఉక్కుపాదం మోపుతున్నాం
- నగర్ క్రైమ్‌పై వార్షిక నివేదిక విడుదల చేసిన సిపి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్, డిసెంబర్ 22 (సమ సమాజం):** 2022తో పోలిస్తే ఈ ఏడాది 2 శాతం నేరాలు పెరిగాయని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో జరిగిన నేరాలపై వార్షిక నివేదకను సిపి శ్రీనివాస రెడ్డి విడుదల చేశారు. స్థిరాస్తి నేరాలు మూడు శాతం పెరిగాయని, ఈ ఏడాదిలో మహిళలపై నేరాలు పెరిగాయని, సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే ఫిర్యాదులను వేగంగా పరిష్కరిస్తున్నామని, పొక్సో కేసులు 12 శాతానికి తగ్గాయని, లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ల కన్నా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు పెరిగాయని సిపి వెల్లడించారు. సైబర్ సెక్యూరిటీపై నిపుణులను పిలిచి అవగాహన కల్పించామని, ఈ ఏడాది అన్ని పండుగలు, ర్యాలీలు ప్రశాంతంగా నిర్వహించామన్నారు. అసెంబ్లీ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించామని, ట్రాఫిక్‌లో కూడా త్వరలో మరికొన్ని పిఎస్‌లు వస్తాయని సిపి తెలియజేశారు. దేశంలో తొలిసారిగా ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామని, నార్కోటిక్ బ్యూరో ఏర్పాటు చేసుకున్నామని, హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ సహకారంతో సదస్సులు నిర్వహించామని పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం హైదరాబాద్ కమిషనరేట్‌లో నగర వార్షిక నేర నివేదికను సిపి విడుదల చేశారు. చాలాకాలం తర్వాత ఈ ఏడాది గణేశ్

4వ పేజీలో...

## కాకా సేవలు మరువలేనివి

### వర్ధంతి వేడుకల్లో సిఎం నివాళి



**హైదరాబాద్, డిసెంబర్ 22 (సమ సమాజం):** కాకా 9వ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాగ్ లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్. అంబేద్కర్ కళాశాలలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకా వర్ధంతి సందర్భంగా వారికివే తన నివాళులన్నారు. వివేక్, వినోద్‌లను చూసినపుడు తనకు రామాయణంలో లవకుశలు గుర్తుకొస్తార న్నారు. ఎంత సంపాదించామనేది ముఖ్యం కాదని, సమాజానికి ఎంత పంచామనేది కాకా సామాజిక బాధ్యత విధానమని కొనియాడారు. గత 50 ఏళ్లుగా ఎంతో మంది విద్యార్థులను తీర్చి దిద్దిన ఘనత కాకా సొంతమన్నారు. దేశ నిర్మాణంలో కాకా తన సామాజిక బాధ్యతను నిర్వర్తించారని, ఎలాంటి లాభాపేక్ష లేకుండా విద్యార్థులకు విద్యనందిస్తున్న ఘనత కాకా కుటుంబానిదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. నిర్దిష్టమైన లక్ష్యాన్ని పెట్టుకుని ఆ దిశగా పనిచేస్తే ఖచ్చితంగా గమ్యాన్ని చేరొచ్చని.. తెలంగాణ ప్రజల ఆశీర్వాదం, నిరుద్యోగుల పోరాటంవల్లే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. కఠోర దీక్షతో తెలంగాణను దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. డబ్బులుంటేనే రాజకీయాలు అనే ఆలోచన పక్కన పెట్టాలని.. ఇందిరమ్మ ఇంట్లో నివసించే సామాన్యుడు కూడా ఎమ్మెల్యేగా గెలిచారన్నారు. ప్రజల్లోకి వెళ్లి ప్రజలకు సేవ చేస్తే ప్రజలు తప్పకుండా ఆదరిస్తారని, దేశంలో గాంధీ కుటుంబంలా.. రాష్ట్రంలో కాకా కుటుంబం కాంగ్రెస్‌కు అండగా ఉంటుందని, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు మేము అండగా ఉంటామని ముఖ్యమంత్రి రేవంత రెడ్డి స్పష్టం చేశారు.

## కామారెడ్డి కలెక్టరేట్‌లో ఘరానా మోసం

### ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల పేరిట టోకరా



**కామారెడ్డి, డిసెంబర్ 22 (సమ సమాజం):** కామారెడ్డి కలెక్టరేట్‌లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల పేరిట ఘరానా మోసం వెలుగులోకి వచ్చింది. ఓ ప్రైవేట్ ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ కలెక్టర్ కార్యాలయంలో ఎస్సీ అభివృద్ధి సంక్షేమ శాఖలో ఉద్యోగాల పేరిట నకిలీ నియామక పత్రాలు జారీ చేసింది. నిరుద్యోగుల వద్ద లక్షల రూపాయలు వసూలు చేసి ఈ నకిలీ నియామక పత్రాలు అంటగట్టింది. ఆ నియామక పత్రాలు తీసుకుని కార్యాలయాలకు వెళితే అవి తనఖీ చేసిన అధికారులు నకిలీ వని తేల్చి చెప్పారు. దీంతో బాధితులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు.. నకిలీ నియామక పత్రాలు జారీ చేసిన ప్రైవేట్ ఏజెన్సీ హైదరాబాదులోని మల్కాజ్‌గిరికి చెందిన సంస్థగా గుర్తించారు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

# ప్రైవేట్ వ్యవహారంలా పార్లమెంట్ సమావేశాలు



ఈ శీతాకాల పార్లమెంట్ సమావేశాలు కూడా ఎలాంటి ప్రయోజనకరంగా లేకుండా ముగిసాయి. ఒకరోజు ముందే ముగించడం ద్వారా..అధికార బిజెపి మమ అనిపించింది. మూకుమ్మడిగా ఎంపిలను సభనుంచి వెలివేయడం ద్వారా బిజెపి మరో చరిత్ర సృష్టించింది. మొత్తంగా సమస్య ఏదైనా కావచ్చు..చర్చించడానికి వారు సిద్దంగా లేరని రుజువు చేసుకున్నారు. సమస్య ఏదైనా చర్చించడమే పార్లమెంటరీ ప్రజాస్వామ్యం. ఓ రకంగా ఇది అధికార విపక్షాల ఉమ్మడి వైఫల్యంగా చెప్పుకోవాలి. ఇరు పక్షాలు పంతాలకు, పట్టింపులకు పోయి సభా సమయాన్ని వృధా చేయడంతో పాటు, ప్రజల ఆకాంక్షలను తుంగలో తొక్కారు. తిలాపాపం తలా పిడికెడు అన్న చందంగా ఎవరికి వారు సమస్యలపై చర్చకు ముందుకు రావడంలేదు. విపక్షాలకు సమాధానం ఇవ్వకుండా అనుకున్న బిల్లులను ప్రవేశ పెట్టి ప్రభుత్వం చేతులు దులుపు కుంటూ వస్తున్నా గమనించడం లేదు. ప్రధాని మోడీ సభకు రాకుండా, చర్చలో పాల్గొనకుండా ఉండడం అలవాటు చేసుకు న్నారు. అనేకానేక కార్యక్ర మాల్లో ఆయన బిజీగా ఉంటూ రానున్న ఎన్నికలపై దృష్టి సారించారు. నిజానికి పార్లమెంటులో ఉండి సమస్యలపై చర్చించి, సమాధానం ఇవ్వాల్సిన పెద్దాయన ఇంత బాధ్యతా రహితంగా ఉండడడం సరైనదేనా అన్నది ప్రజలు ఆలోచించాలి. ప్రజాసమస్యలు చర్చించడానికి అత్యున్నత వేదిక అయిన పార్లమెంట్ ఇలా వృధాగా ముగియడం వల్ల నష్టపోతున్నది ప్రజలే. అవసరమైతే ప్రభుత్వాన్ని నిలదీయడానికి వీలు కల్పించే అవకాశం ఉన్నా..ఆందోళనలతో సభా సమయాన్ని వృధా చేసుకున్న విపక్షాలను కూడా క్షమించరాదు. తాము పట్టిన కుందేటికి మూడే కాళ్లు అన్నచందంగా విపక్షాలు చర్చలకు అవకాశం ఉన్న అంశాలను, అవకాశాలను వదులుకుంటున్నారు. గెలిపించాం కదా అని తమ ఇష్టానుసారం పార్లమెంట్‌ను నడిపించాలని చూశారు. ఇరుపక్షాలు ఉడుంపట్టుతో ఈశీతాకాలపార్లమెంట్ సమావేశాలు కూడా ఎలాంటి చర్చలు లేకుండా ముగిశాయి. మొత్తంగా చర్చకు అవకాశం కల్పించరాదన్న ధోరణిలో అధికార బిజెపి ఉంటే..చర్చ చేయకుండా రచ్చ చేసి బయటకు రావాలన్న విపక్షాల ధోరణి కారణంగా ప్రజలు బిక్కమొహం వేయాల్సి వచ్చింది. అందుకే ఇరుపక్షాల తీరు ఆందోళన కరంగా ఉంటోది. ప్రజల సమస్యలను చర్చించాల్సిన చట్టసభల్లో అలాంటి ప్రయత్నాలు జరగడం లేదని వరుసగా జరుగుతున్న పార్లమెంట్ సమావేశాలు రుజువు చేశాయి. ఎదుటి వారి విమర్శలకు ప్రతి విమర్శలు చేయడమెలా అన్న వ్యూహంలో సాగుతున్నాయి. దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై ఏనాడూ చర్చకు అవకాశం రావడం లేదు. విపక్షం అంటే విమర్శించడం..అధికార పక్షం అంటే సమాధానం దాట వేయడం అన్న చందంగా మన చట్టసభలు సాగుతున్న తీరు పార్లమెంట్ వ్యవస్థకు మచ్చగా మారుతున్నది. పార్లమెంటును దేవాలయంగా పోల్చిన నేతలు దానిని అపవిత్రం చేస్తున్నారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం విపక్షాల బాధ్యత. దానిపై చర్చించడం ప్రభుత్వ బాధ్యత. కానీ ఈ రెండూ నెరవేరకుండానే పార్లమెంట్ సమావేశాలు సాగుతున్న తీరు ప్రజలను ఆవేదనకు గురి చేస్తోంది. అధికారంలో ఉన్నవారే పెద్ద మనసుతో, పట్టువిడుపుల ధోరణిని ప్రదర్శించడం వల్ల ప్రజలకు మేలు జరుగు తుంది. కానీ ఇరు పక్షాలూ భీష్మించుకొని పార్లమెంటరీ ప్రతిష్టంభనకు కారణమైతే అందుకు ప్రజలు ఏమను కోవాలి. ఎందుకు ఓటేసామని అనుకోవాలి. ఇలాంటి వారిని తాము చట్టసభలకు ఎందుకు పంపామా అని తలదించుకోవాలి. ఇలాంటి వారిని ఎన్నుకోవడం అవసరమా అని ఆత్మపరిశీలన చేసుకోవాలి.ఈసారి కూడా పార్లమెంట్ శీతాకాల సమావేశాలు పెద్దగా ఎలాంటి చర్చ లేకుండా ముగించేయడం ఓ రకంగా అధికార బిజెపి అహంకారానికి అద్దం పట్టాయి. అలాగే విపక్ష సభ్యుల మొండి వైఖరిని ప్రస్ఫుటం చేశాయి. పార్లమెంట్ భద్రతపై చర్చకు పట్టుబట్టడం తప్ప విపక్షాలు సాధించింది కూడా ఏమీలేదు. ఏ పార్టీ అధికారం లో ఉన్నా భద్రత విషయంలో అప్రమత్తత అన్నది భద్రతాబలగాలు చూసుకుంటాయి. భద్రతా బలగాలు ఎల్లవేళలా అప్రమత్తంగానే ఉంటారన్నది పార్లమెంట్ సభ్యులు తెలుసుకోవాలి. కాపలాకాస్తున్న భద్రతా బలగాలు తమ ప్రాణాలను ఒడ్డి సభ్యులను రక్షిస్తుంటారు. అయితే అప్పుడప్పుడు అనుకోని సంఘటనలు జరుగుతాయి. ఈ సమావేశాల సందర్భంగా ఓ ఇద్దరు దుండగులు చేసిన దుశ్చర్యను పట్టుకుని పార్లమెంట్ సమావేశాలనే ప్రతిష్టంభన చేయడం ద్వారా విపక్షం తన బాధ్యతను విస్మరించింది. అధికార పార్టీ కూడా ఇదే కోరుకుంది. చర్చకు వారెప్పుడూ సిద్దంగా లేకపోవడం ఈ పదేళ్ల కాలం నుంచి చూస్తున్నాం. ఇకపోతే ప్రభుత్వానికి ఎలాగూ ప్రజల సమస్యలపై చిత్తశుద్ది లేదు. కనీసం విపక్షం అయినా వ్యూహాత్మకంగా వ్యవహరించలేక పోయింది. దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై సర్కార్‌ను నిలదీయడంలో విఫలమయ్యారు. అధికార పక్షం కోరుకున్నట్లుగానే రచ్చచేసి సమావేశాలకు అర్థం లేకుండా ముగించేశారు. ప్రజల సమస్యలపై చర్చించాలన్న లక్ష్యం లేకుండా సమావేశాలు సాగుతున్న తీరు చూస్తుంటే... ఎందుకీ పార్లమెంట్ సమావే శాలు అని అనుమానం కలుగుతోంది. నిరంతరం సభను స్తంభింపచేయడమే తమ విజయమని విపక్షాలు భావిస్తున్నట్లుగా ఉంది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించాల్సిన అత్యున్నత వేదిక తన బాధ్యతను చేపట్టడంలో విఫలమవుతోందా అని ఆలోచించే సమయం వచ్చింది. కరోనా మళ్లీ విజృంభి స్తోంది. ప్రజలకు కేంద్రం మరోమారు హెచ్చరికలు చేసింది. కరోనా కేసులు పెరగడం ప్రపంచాన్ని ఆందోళన కలిగిస్తోంది. దీనిపై చర్చకు పట్టు బట్టాల్సింది. ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం, పెరుగుతున్న వడ్డీరేట్లు, జిఎస్టీ వడ్డింపులు తదితర ఎన్నో సమస్యలను ప్రజలు ఎదుర్కొంటు న్నారు. వీటిపై ప్రభుత్వాన్ని నిలదీసేలా సమస్యలపై చర్చకు వ్యూహం లేకుండా విపక్షం వ్యవహరించడం సిగ్గుచేటు. మొత్తంగా ఈ పార్లమెంట్ శీతాకాల సమావేశాలు కూడా ఎలాంటి ఫలితాలన్ని చూపకుండా పోయాయనే చెప్పుకోవాలి. చట్టసభల్లో చర్చల కన్నా వాదోపవాదాలు, గందరగోళాలే ఎక్కువ సమయం వృధా జరుగుతోంది. పార్లమెంట్ సభ్యులను ఎన్నుకున్నది ఇందుకేనా అన్న ఆవేదన ప్రజలకు కలుగుతోంది. అధికార పక్షం, ప్రతిపక్షం అన్న తేడా లేకుండా ఎవరికి వారు తమకు తోచిన విధంగా పార్లమెంట్ సమావేశాలను సాగకుండా దోహదపడ్డారు. సమస్యలను చర్చించడమే చట్టసభలకు, సభ్యులకు మహోన్నత లక్ష్యం కావాల్సి ఉండగా గందనగోళం సృష్టించి సభలను వాయిదా వేయించడమే తమ లక్ష్యంగా ముందుకు సాగాయి. పార్లమెంట్ శీతకాల సమావేశాలు తీరు చూసినప్పుడు ఆవేదన కలగక మానదు.

## పివి సంస్కరణలే నేటికీ దిక్సూచి

### దేశగతిని మార్చిన అపర మేధావి


భారతరత్న ఇవ్వకుండా సంకుచిత రాజకీయాలు

నేడు పివి వర్ధంతి సందర్భంగా...



**హైదరాబాద్, డిసెంబర్ 22 (సమ సమాజం):** భారతదేశ ఆర్థిక స్థితిగతులను అనూహ్యంగా మార్చి పారిశ్రామిక ప్రగతికి గేట్లు తెరిచిన ఆర్థిక సంస్కర్త దివంగత పివి నరసింహారావు. అందుకే దేశం ఇవాళ విదేశాలతో పోటీ పడేలా చేయడం తన దూరదృష్టితో నిర్ణయాలు తీసుకు న్నారు. ఆయన డిసెంబర్ 23న మరణించారు. ఆయన మరణంతో దేశం గొప్ప మేధావిని కోల్పోయింది. ఆర్థిక పరిస్థితులను అంచనా వేసుకున్నప్పుడు పివికి ముందు పివి తరవాత అన్న లెక్కలు వేసుకునే స్థితి చెప్పుకోక తప్పదు. రాజకీయాల్లో అరుదైన వ్యక్తిత్వాలు కలిగినవారు బహు అరుదుగా ఉంటారని పివి తనరాజకీయ జీవితంలో నిరూపిం చారు. అలాగే పదవుల కోసం వెంపర్లాడుతున్న నేటి రాజకీయాల్లో పదవులు వాటంతటవే వెతుక్కుంటూ రావడం...వాటికి వన్నె తేవడం కూడా బహు అరుదు. ఓ మహానుభావుడు రాకుంటే భారత ఆర్థికస్థితి ఏమయ్యేదో అన్న ఆలోచన లేకుండా అలాంటి మహానుభావుడు పివి రూపంలో భారతదేశానికి సాక్షాత్కరించడం కూడా దేశం చేసుకున్న అదృష్టంగా చూడాలి. నిజానికి ఎక్కడో వరంగల్ జిల్లా వంగరలో పుట్టి దేశానికి దిక్సూచిగా అయిన తీరు గమనిస్తే ఎక్కడా ఆయన రాజకీయాలు చేయలేదు. రాజకీయాలు ఆయన అసవరాన్ని గుర్తించాయి. ఇందిర అయినా.. .రాజీవ్ అయినా ఆయనలోని అపార ప్రతిభను గుర్తించి చేరదీసారే తప్ప మరోటి కాదు. రాజకీయాల్లో స్థితప్రజ్ఞత ఉన్న అరుదైన నేతల్లో పివి ముందుంటారు. ఆయన స్వార్థం కోసం ఏనాడూ రాజకీయాలు చేయలేదు. అలాగే ఆయనలోని స్వార్థం దేశానికి మంచి చేయాలన్న తపన తప్ప మరోటి కాదు. రాజకీయాల్లో రాణించడం కోసం ఎత్తులు పై ఎత్తులు వేస్తూ.. ఎదుటి వారిని బురిడీ కొట్టించడం... అవసరమైతే ప్రత్యర్థులను మట్టుపెట్టడం లాంటి నేటి రాజకీయాల్లో అరుదైన వ్యక్తిత్వం కలిగిన మహాను భావుడు దివంగత పివి నరసింహారావు. ఆయన ప్రధాని గా ఉన్నకాలంలో చేపట్టిన ఆర్థిక సంస్కర ణలే ఇవాళ దేశానికి అన్నం పెడుతున్నాయి. మన యువత విదేశాలకు ఉద్యోగాల వేటకు వెళ్లగలుగుతున్నారు. ఆయన రాజకీయాల్లో స్వశక్తితతో, ప్రతిభతో రాణించారే తప్ప అడుగులకు మడుగులు ఒత్తి రాలేదు. ఆ మహానభావుడు మన తెలుగు వాడైనందుకు మనమంతా గర్వపడాలి. అలాంటి రాజకీయవేత్త ఒకరు భారత ప్రధాని అయినందుకు మనమంతా ఎంతో అదృష్ట వంతులం. అలాంటి వ్యక్తిని నీచాతినీచంగా అవమానించిన ఘనత కాంగ్రెస్‌ది, దాని అధినేత్రి సోనియాది. పివి కాంగ్రెస్‌కు ఎంతో పేరు తెచ్చారు. ఆయన పాలనా సంస్కరణలతో దేశానికి అలాగే కాంగ్రెస్ పార్టీకి చరిత్రలో లిఖించదగ్గ ఘట్టాలను అందించారు. సానుకూల, ప్రతికూల రాజకీయాలను ఆమూలాగ్రం ఔపోసన పట్టిన ఘటికుడు ఆయన. అందుకే వాటిని అర్థం చేసుకుని అందుకు అనుగుణంగా పాలన చేసి..తిరుగలేని నేతగా రుజువు చేసుకున్నారు. నిజానికి పివి హయాం తరవాత సంకీర్ణాలు మొదలయ్యాయి. పివి కూడా ఆనాడు సంకీర్ణ రాజకీయాలకు తెరతీసి ఉంటే దేవేగౌడ స్థానంలో మళ్లీ పివియే ప్రధాని అయ్యేవారు. తనకున్న స్థానాలతో తానే మరోమారు ప్రధానిగా అయ్యేందుకు సంకీర్ణ రాజకీయాలు నెరపి ఉంటే భారత చరిత్ర మరోలా ఉండేది. ఆయనకు ఆనాడు ఈ ఆలోచన రాక కాదు. కానీ కుళ్లు రాజకీయాలు మోయడం ఇష్టం లేకే ఆయన అలాంటి ప్రతిపాదనలు చేసి ఉండక పోవచ్చు.అయినా ఆయన పాలనా కాలం ఓ స్వర్ణయుగం. ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా, ప్రధాన మంత్రిగా, ఆర్థిక సంస్కరణ లను అద్వితీయంగా అమలుపరిచిన పాలనాదక్షుడు పీవీ నరసింహరావు. అందుకే బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఆయన చరిత్ర పుటల్లో నిలిచిపోతారు. దేశం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పుడు, ఊహించని రీతిలో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి మార్కెట్ సరళీకరణ విధానాన్ని రూపొందించి భారత్‌కు మార్గాన్ని చూపారు. ఇప్పుడా మార్గంలోనే మన ఆర్థిక వ్యవస్థ నడుస్తోంది. ఆయన చూపిన బాట నుంచి పక్కకు తప్పినప్పుడల్లా మళ్లీ సంక్షోభాలు ఎదుర్కొంటున్నాం. పీవీ జీవిత కాలంలో అనేక సందర్భాలలో, ఆయనను తక్కువగా అంచనా వేసిన కాంగ్రెస్ ఇక ఎప్పటికీ కోలుకోదు. ఆయనకు చేసిన అవమానం అంతాఇంతా కాదు. కానీ పదవుల కోసం వెంపర్లాడే వారు పివిని అవమానించినా పట్టించు కోకుండా మిన్నకుండి ఇవాళ ఆయన గురించి మాట్లాడుతున్నారు. ఆయనను భారతరత్నతో గౌరవించాలన్న డిమాండ్ ఉన్నా... సంకుచిత రాజకీయాల కారణంగా దూరం పెట్టారు.

## హైదరాబాద్ నీలోఫర్‌లో తొలి కరోనా కేసు



15 నెలల చిన్నారికి కరోనా పాజిటివ్

ప్రత్యేకవార్డులో చికిత్స అందిస్తున్న వైద్యులు

హైదరాబాద్, డిసెంబ్ 22 కరోనా మహమ్మారి మరోసారి విజృంభిస్తోంది. నీలోఫర్ ఆస్పత్రిలో తొలి కరోనా కేసు నమోదైంది. హైదరాబాద్ నాంపల్లిలోని నిలోఫర్ ఆస్పత్రిలో 15 నెలల చిన్నారికి కొవిడ్-19 సోకింది. నాంపల్లి ఆగాపుర ప్రాంతానికి చెందిన 15 నెలల పాప నాలుగైదు రోజులుగా తీవ్ర జ్వరం, ఊపిరి పీల్చుకోవడానికి ఇబ్బంది పడుతుండటంతో నిలోఫర్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. అక్కడ చికిత్స మొదలుపెట్టిన వైద్యులు.. అనుమానం వచ్చి కరోనా పరీక్ష చేయగా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. దీంతో ఐసోలేషన్ వార్డులో ఉంచి చికిత్స అందిస్తున్నారు. గురువారం హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రి 'నీలోఫర్'లో బాలుడికి కొవిడ్ నిర్ధారణ అయ్యింది. అయితే బాలుడి బాలుడి ఆరోగ్యం స్థిరంగానే ఉందని హాస్పిటల్ సూపరింటెండెంట్ ఉషారాణి వెల్లడించారు. ఈనెల 18న న్యూమోనియాతో చిన్నారిని హాస్పిటల్‌లో చేర్పించారని, దగ్గు, జలుబు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపించాయని ఆమె వివరించారు. అన్ని న్యూమోనియో కేసులకు కరోనా టెస్టులు చేస్తుంటామని, అదేవిధంగా బాలుడికి కూడా నిర్వహించగా కొవిడ్ నిర్ధారణ అయ్యిందని చెప్పారు. బుధవారం శాంపుల్స్‌ను టెస్టింగ్‌కు పంపించగా గురువారం నిర్ణారణ అయ్యిందని వివరించారు. అయితే బాలుడి తల్లిదండ్రుల్లో కరోనా లక్షణాలులేవని పేర్కొన్నారు. ప్రస్తుతం చిన్నారి ఆరోగ్యం మెరుగ్గా ఉందని.. వెంటిలేటర్‌పై నుంచి తొలగించి చికిత్స అందిస్తున్నామని వైద్యులు తెలిపారు.


## గోకుల్ చాట్ యజమాని మృతి



**హైదరాబాద్, డిసెంబర్ 22 (సమ సమాజం):** హైదరాబాద్ కోటిలో బాగా ప్రాచుర్యం పొందిన గోకుల్ చాట్ యజమాని ముకుంద్ దాస్ (75) గురువారం మరణించారు. ఆయన వయసు రీత్యా వచ్చిన కొన్ని ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ మరణించారని కుమారుడు వెల్లడించారు. అనారోగ్యంతో కొద్ది రోజులుగా బాధపడుతున్న ముకుంద్ దాస్‌ను కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం జాయిన్ చేశారు. ఆయన చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన అంత్యక్రియలను కుటుంబ సభ్యులు పూర్తి చేశారు. తెలంగాణలోనే పేరుగాంచిన గోకుల్ చాట్‌ను ముకుంద్ దాస్ 1970లో స్థాపించారు. అప్పటి నుంచి గోకుల్ చాట్ క్రమక్రమంగా ఫేమస్ అయిపోయింది. ఉగ్రవాదలు బాంబు దాడి ఘటనతో గోకుల్ చాట్ బాగా ఫేస్ అయ్యింది

## శ్రీరంగంలో వైకుంఠ శోభ

### భారీగా తరలివస్తున్న భక్తులు



**శ్రీరంగం, డిసెంబర్ 22 (సమ సమాజం):** తమిళనాడులోని శ్రీరంగంలోని శ్రీ రంగనాథస్వామి వారి దేవాలయంలో ముక్కోటి దర్శనాలకు భక్తులు పోటెత్తుతారు. వేకుమజాము నుంచే భక్తులకు దర్శనాలకు అనుమతిస్తారు. ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని వైకుంఠ ద్వారాలు తెరచి భక్తులకు దర్శన అవకాశం కల్పిస్తారు. మిగిలిన రోజులలో ఈ ద్వారం మూసి ఉంటుంది. పురాణాల ప్రకారం రంగనాథస్వామి దక్షిణ ముఖంగా నిలిచి ఉత్తర ముఖంగా ఉన్న విభీషణుడికి దర్శనమిచ్చాడని చెబుతారు. అక్కడ 20 రోజులపాటు ఘనంగా ఉత్సవాలు నిర్వహిస్తారు. శ్రీరంగనాధులు ఇక్కడ స్వయంగా వెలిశారిన ప్రతీతి. రంగనాధుడిని నిత్యం ఇక్కడ కొలిచేందుకు విభీషణాదులు వస్తారని అంటారు. స్వామిని దర్శించుకునేందుకు వేలాదిగా భక్తులు దేశంలోని నలుమూలలనుంచి ఇక్కడికి తరలివస్తుంటారు. దీంతో ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ముక్కోటి ఏకాదశి రోజున ఆచరించాల్సిన పూజా విధిని పెద్దలు సూచించారు. దాని ప్రకారం, సూర్యోదయానికి పూర్వమే స్నానాదులు ఆచరించాలి. శుచిగా పూజా మందిరంలో శ్రీ మహావిష్ణువుని లేదా శ్రీ పరమశివుని బిల్వదళాలు, శంఖం, పూలు, తులసి దళాలతో అర్చించాలి. ఉత్తరం లేదా తూర్పు లేదా ఈశాన్యం వైపు చూసే విధంగా దీపాలు వెలిగించాలి. ఇంట్లో పూజా కార్యక్రమాలు పూర్తిచేసి, ఆలయాలకు వెళ్ళి ఉత్తర ద్వార దర్శనం చేసుకోవాలి. ఈ రోజు లక్ష్మీనారాయణులను ప్రత్యేకంగా అర్చించాలి. పూజానంతరం నేతిలో పెసరపప్పు, బియ్యం వేయించి ఉడికించిన పొంగలి నివేదన చేయాలి. ఏకాదశి వ్రత ప్రభావం వలన జన్మజన్మాంతరాల నుంచి పీడిస్తున్న బాధలు తొలగిపోయి, ఐశ్వర్యం, సుఖ జీవన ప్రాప్తి కలుగుతాయన్నది పురాణ ప్రవచనం.


## ఆలయాల్లో ముక్కోటి పర్వదిన శోభ

### బారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు



**హైదరాబాద్, డిసెంబర్ 22 (సమ సమాజం):** భద్రాచలంలోని రామాలయంతో పాటు అనేక వైష్ణవాలయాలు వైకుంఠశోభతో అలరారుతున్నాయి. వైకుంఠాన్ని మైమరిపించేలా ఆలయ పరిసరాల్లో అధికారులు ఏర్పాట్లు చేశారు.దాదాపుగా అన్ని వైష్ణవాలయాల్లో ఉత్తరద్వార దర్శనం కోసం భక్తులు బారులు తీరుతారు. తిరుమల, భద్రాచలం, యాదాద్రి, ధర్మపురి, తమిళనాడులోని శ్రీరంగనాథ క్షేత్రం ఇలా వైష్ణవ క్షేత్రాల్లో భక్తుల సందడి నెలకొంటుంది. అలాగే నగరంలోని బాలాజీ టెంపుల్, చిక్కడపల్లి వెంకటేశ్వరాలయం, అహోబిల లక్ష్మీనారసింహ దేవాలయం,చిలుకూరు బాలాజీ ఆలయంతో పాటు అనేకాలయాల్లో ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేశారు. భద్రాచల దివ్యక్షేత్రం ముక్కోటి ఏకాదశి మహోత్సవాల వేళ దేదీప్యమానంగా ప్రకాశిస్తోంది. యాదాద్రిలో దివిలో వైకుంఠం భువిపై ప్రత్యక్షమైందా అన్నరీతిలో ఏర్పాట్లు చేశారు. వైకుంఠ ఏకాదశి మహోత్సవాల నేపథ్యంలో దక్షిణ అయోధ్య కలియుగ వైకుంఠంగా దర్శనమిస్తోంది. భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో అధ్యయనోత్సవాలు ప్రారంభమవగా తొలి పది రోజుల పాటు పగల్‌పత్తు ఉత్సవాలను నిర్వహించారు. ఈ సమయంలో స్వామి వారు దశావతారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. రామాలయంలో జరిగే పూజల్లో ఎక్కువ భాగం తమిళనాడులోని శ్రీరంగం ఆలయం తరహాలో జరుగుతాయి. వైష్ణవ సంప్రదాయంలో పూర్తి నిబద్ధతతో అన్ని లెక్కలను పరిగణలోకి తీసుకుని ముక్కోటి ఏకాదశిని నిర్వహిస్తున్నారు.


## ప్రజావాణికి వెల్లువెత్తిన ఫిర్యాదులు



(మొదటి పేజి తరువాయి) రాష్ట్రంలో పదేళ్లు విధులు నిర్వహించిన తర్వాత.. తమకు ఆర్డర్ కాపీ లేదని 2011లో తీసేశారని, 2014లో తెలంగాణ రాష్ట్రం వచ్చాక తమకు న్యాయం చేయాలని తిరగ్గా.. తిరగ్గా 2018లో మమ్మల్ని విధుల్లోకి తీసుకుంటామని మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా హామీ ఇచ్చారని, ఆ హామీ నెరవేరలేదని అన్నారు. గత ప్రభుత్వంలో అన్యాయం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే అందరినీ ఆదుకుంటామని గతంలో మాకు రేవంత్ రెడ్డి, సీతక్క, భట్టి విక్రమార్క హామీ ఇచ్చారని.. ఇప్పుడు తమను విధుల్లోకి తీసుకుంటారనే నమ్మకంతో ప్రజా వాని కార్యక్రమానికి వచ్చామని హోంగార్డులు చెప్పారు.

## అయోధ్యలో వరవేగంగా ఏర్పాట్లు

### ఆహ్వాన పత్రాలు ఉన్నవారికి మాత్రే ప్రవేశం



**లక్నో, డిసెంబర్ 22 (సమ సమాజం):** కొత్తగా నిర్మిస్తోన్న రామ మందిర ప్రతిష్ఠాపనకు ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. జనవరి 22న జరగబోయే ఈ ప్రతిష్టాపక క్రతువుకు రామ మందిర ట్రస్ట్, ప్రభుత్వ విధుల్లో చెల్లుబాటు అయ్యే ఆహ్వానాలు ఉన్నవారు మాత్రమే అయోధ్యలో ప్రవేశానికి అనుమతించనున్నారు. డిసెంబర్ 21న అయోధ్యలో జరిగిన సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్.. ఇతర వ్యక్తుల ముందస్తు బుకింగ్‌లను రద్దు చేయాలని, ట్రస్ట్ ఆహ్వానించిన వారికే ప్రాధాన్యత ఇవ్వాలని స్థానిక హోటల్ యజమానులను, అయోధ్య అధికారులను ఆదేశించారు. అయోధ్యలో యాత్రికుల వసతి కోసం ట్రస్ట్ ఏర్పాట్లతో పాటు, ధర్మశాల, హోటళ్ళు మొదలైన ప్రదేశాల్లో యాత్రికులు బస చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేయాలని యోగి ఆదిత్యనాథ్ చెప్పారు. జనవరి 22న జరగబోయే ఈ కార్యక్రమానికి ఆహ్వాన పత్రికలు ఉన్నవారు, ప్రభుత్వ విధుల్లో ఉన్నవారు మాత్రమే అయోధ్య లోపలికి అనుమతి ఉంటుందని తెలిపారు. జనవరి 22న ప్రాణ ప్రతిష్ఠా వేడుక రోజున కొంతమంది స్థానిక హోటళ్లు, ధర్మశాలలను బుక్ చేసుకున్నట్లు తెలిసిందని, నిర్వహణలో ఎలాంటి సమస్య రాకుండా వారి బుకింగ్ ను రద్దు చేయాలన్నారు. ఎందుకంటే ఆ రోజున భారతదేశం నలుమూలల నుంచి అయోధ్యకు పలువురు అతిథులు రానున్నారని చెప్పారు. దాంతో పాటు అయోధ్య విమానాశ్రయానికి 100 విమానాలు వచ్చే అవకాశం ఉందన్న ఆయన.. వాటి మళ్లింపు కోసం కూడా ఏర్పాట్లు చేయండని ఆయన అధికారులను ఆదేశించారు.

## అంగన్‌వాడీలపై దుష్ప్రచారం

### ఫుడ్‌కమిటీ చైర్మన్‌ను నిలదీసిన కార్యకర్తలు



**మైదుకూరు, డిసెంబర్ 22 (సమ సమాజం):** మైదుకూరు పట్టణంలో రాష్ట్ర ఫుడ్ కమిటీ చైర్మన్ చిత్తా విజయ్ కుమార్ రెడ్డిని అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు నిలదీశారు. రాష్ట్రంలోని అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లను దోషిలుగా వీడియోలు చిత్రీకరించడం సబబు కాదని అన్నారు. శుక్రవారం చిత్త విజయ్ కుమార్ రెడ్డి కారును అడ్డుకున్న అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు మీరు తీస్తున్న వీడియోలలో అంగన్వాడీ కార్యకర్తలకు రూ. 6వేలు కూడా ఎక్కువే అంటూ వీడియో పోస్ట్ చేయడం సబబు కాదని అన్నారు. వెంటనే అంగన్వాడీలకు క్షమాపణ చెప్పాలంటూ నిలదీశారు. స్పందించిన చిత్తా విజయ్ కుమార్ రెడ్డి నేను తీసిన వీడియోను మీకు ఎవరో కట్ చేసి పంపారంటూ సమాధానం ఇచ్చారు. నేను అంగన్వాడి కార్యకర్తలకు అనుకూలంగా ఉంటానని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో వీలైనంత త్వరగా మాట్లాడి అంగన్వాడీ కార్యకర్తలకు, హెల్పర్లకు న్యాయం జరిగేలా చూస్తానంటూ హామీ ఇచ్చారు. దీంతో అంగన్వాడీ కార్యకర్తలు శాంతించారు. కార్యక్రమంలో సిఐటియు, ఏఐటియుసి, ఐఎఫ్టియు, సిపిఎం, సిపిఐ, ఎంఆర్పిఎస్ నేతలు పాల్గొన్నారు.

## ఈశాన్య గాలులతో పెరుగుతున్న చలి



**మంచిర్యాల, డిసెంబర్ 22 (సమ సమాజం):** ఈశాన్యం వైపు నుంచి వీస్తున్న చలిగాలుల ప్రభావంతో రాష్ట్రంలో చలి తీవ్రత పెరిగింది. రోజురోజుకు పడిపోతున్న ఉష్ణోగ్రతలతో జనం చలితో వణికిపోతున్నారు. చలి ప్రభావం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాపై తీవ్రంగా ఉంది. గురువారం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యు)లో కనిష్ఠంగా 6.6, ఆదిలాబాద్ జిల్లా జైనథ్‌లో 7.5, నిర్మల్ జిల్లా పెంబిలో 8.7 డిగ్రీలు, మంచిర్యాల జిల్లా జైపూర్‌లో 10 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా గ్రేటర్ హైదరాబాద్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రత 13.6 డిగ్రీలు నమోదైంది.

# కోవిడ్ కొత్త వేరియంట్‌పై ముందస్తు చర్యలు



**వ్యాప్తి చెందకుండా దృష్టి సారించాలి ◆ విలేజ్ క్లినిక్ వ్యవస్థను అప్రమత్తం చేయండి**

**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా బోధన ◆ జెఎన్-1 వ్యాప్తిపై సిఎం జగన్ ఉన్నతస్థాయి సమీక్ష**

**అమరావతి, డిసెంబర్ 22 (సమ సమాజం):** కోవిడ్ కొత్త వేరియంట్ వల్ల ఆందోళన అనవసరమని వైద్యులు చెప్తున్నప్పటికీ ..ముందస్తు చర్యల పట్ల దృష్టిపెట్టాలని సిఎం జగన్ అధికారులను ఆదేశించారు. అత్యంత బలంగా ఉన్న గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను, విలేజ్ క్లినిక్ వ్యవస్థను ముందస్తు చర్యలకోసం అలర్ట్ చేయాలన్నారు. కొత్త వేరియంట్ లక్షణాలు, తీసుకోవాల్సిన చర్యలపై విలేజ్ క్లినిక్స్ స్టాఫ్‌కు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా బోధన చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. కొవిడ్ కొత్త వేరియంట్‌పై క్యాంపు కార్యాలయంలో సీఎం వైయస్ జగన్ సమీక్ష నిర్వహించారు. కొవిడ్ కొత్త వేరియంట్ జేఎన్-1 విస్తరిస్తుందన్న సమాచారం నేపథ్యంలో సమీక్షించారు. జేఎన్-1 వేరియంట్‌పై పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సీఎంకు అధికారులు చెప్పారు. ఎలాంటి కాంప్లికేషన్స్ లేకుండానే ఈ కోవిడ్ వేరియంట్ సోకినవారు రికవరీ అవుతున్నారని అధికారులు తెలిపారు. ఆస్పత్రికి వెళ్లాల్సిన అవసరం లేకుండానే కోలుకుంటున్నారని వెల్లడించారు. డెల్టా వేరియంట్ తరహా లక్షణాలు లేవని అధికారులు తేల్చారు. అయితే జేఎన్-1కు వేగంగా విస్తరించే లక్షణం ఉందని వివరించారు. లక్షణాలు ఉన్నవారికి ప్రభుత్వ ఆస్పత్రుల్లో పరీక్షలు చేస్తున్నామని.. పాజిటివ్ వచ్చిన శాంపిల్లను విజయవాడ జీనోమ్ ల్యాబ్‌లో పరిశీలిస్తున్నామని వెల్లడించారు. కొత్త వేరియంట్లను గుర్తించ డానికి ఈ పరీక్షలు దోహదం చేస్తున్నాయని చెప్పారు.గ్రామ, వార్డు సచివాలయాల వద్ద ర్యాపిడ్ టెస్టింగ్ కిట్స్ పెడుతున్నామని అధికారులు తెలిపారు. అలాగే ఆస్పత్రుల్లో పర్సనల్ కేర్ కిట్లు కూడా అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. అవసరమైన మందులు కూడా అందుబాటులో ఉన్నాయ న్నారు. ప్రభుత్వ పరంగా ముందస్తు చర్యల్లో భాగంగా ఆక్సిజన్ ఇన్‌ఫ్రాను సిద్ధం చేస్తున్నామని అన్నారు. పీఎస్ఏ ఎ÷-లాంట్లు నడిపి సత్వర వినియోగానికి అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. అలాగే ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్లు, డి-టైప్ సిలిండర్లు కూడా సిద్ధంచేశామని, 56,741 ఆక్సిజన్ బెడ్లు కూడా సిద్ధంగా ఉన్నాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.ఈ వేరియంట్ వల్ల ఆందోళన అనవసరమని వైద్యులు చెప్తున్నారని సీఎం జగన్ తెలిపారు. ముందస్తు చర్యల పట్ల దఅష్టిపెట్టాలని అధికారులను ఆదేశించారు. అత్యంత బలంగా ఉన్న గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను, విలేజ్ క్లినిక్ వ్యవస్థను ముందస్తు చర్యల కోసం అలర్ట్ చేయాలన్నారు. కొత్త వేరియంట్ లక్షణాలు, తీసుకోవాల్సిన చర్యలపై విలేజ్ క్లినిక్స్ స్టాఫ్‌కు అవగాహన కల్పించాలని సీఎం సూచించారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా బోధన చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. డెల్టా వేరియంట్ తరహా లక్షణాలు లేవని తేల్చిన అధికారులు.. అయితే జేఎన్1కు వేగంగా విస్తరించే లక్షణం ఉందని వివరించారు. లక్షణాలు ఉన్నవారికి ప్రభుత్వ ఆస్పత్రుల్లో పరీక్షలు చేస్తున్నామని అధికారులు వెల్లడించారు. పాజిటివ్ వచ్చిన శాంపిల్లను విజయవాడ జీనోమ్ ల్యాబ్‌లో పరిశీలిస్తున్నాం. కొత్త వేరియంట్లను గుర్తించడానికి ఈ పరీక్షలు దోహదం చేస్తున్నాయి. గ్రామ, వార్డు సచివాలయాల వద్ద ర్యాపిడ్ టెస్టింగ్ కిట్స్ పెడుతున్నాం. అలాగే ఆస్పత్రుల్లో పర్సనల్ కేర్ కిట్లు కూడా అందుబాటులో ఉన్నాయి. అవసరమైన మందులు కూడా అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ పరంగా ముందస్తు చర్యల్లో భాగంగా ఆక్సిజన్ ఇన్‌ఫ్రాను సిద్ధం చేస్తున్నాం. పీఎస్ఏ ఎ÷-లాంట్లు నడిపి సత్వర వినియోగానికి అందుబాటులోకి తీసుకొస్తున్నాం. అలాగే ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్లు, డి?టైప్ సిలిండర్లు కూడా సిద్ధంచేశాం. 56,741 ఆక్సిజన్ బెడ్లు కూడా సిద్ధంగా ఉన్నాయని అధికారులు వెల్లడించారు.

# నేటి ముక్కోటి వైకుంఠ ద్వార దర్శనం

### తిరుమలలో భారీగా ఏర్పాట్లు

అందంగా ముస్తాబైన తిరుమల గిరులు



**తిరుమల, డిసెంబర్ 22 (సమ సమాజం):** ధనుర్మాసంలో మకర సంక్రమణానికి ముందుగా వచ్చే ఏకాదశి- వైకుంఠ ఏకాదశి. దీన్ని ముక్కోటి, మోక్షద ఏకాదశి, సఖ్యద ఏకాదశి అని పిలుస్తారు. వైష్ణవ ఆలయాల్లో ఉత్తర ద్వారం మోక్ష ద్వారమని ప్రతీతి. అది ఆ ఒక్క రోజే తెరుచుకుంటుంది. దాన్ని 'వైకుంఠ ద్వారం' అంటారు. తిరుమలలో వైకుంఠద్వార ప్రవేశానికి భక్తులు భారీగా తరలివస్తారు. వైకుంఠ ద్వారాలు తెరుచుకునే ఏకాదశి కనుక, దీనికి వైకుంఠ ఏకాదశి అన్న ప్రసిద్ధి ఏర్పడింది. ఆలయాలను పుష్పాలతో అలంకరించారు. వేకువ జామునే పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు భారీగా ఉత్తర ద్వార దర్శనానికి తరలి రానున్నారు. ఇకపోతే తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వారాలు పది రోజుల పాటు తెరిచి ఉంచాలని నిర్ణయించారు. వైకుంఠ ఏకాదశి, ద్వాదశి రోజుల్లో మాత్రమే కాకుండా మరో వారం రోజలు పాటు వైకుంఠ దర్శనం ఉంటుందని స్పష్టం చేశారు. అటు, శ్రీవారి దర్శనానికి వచ్చే ప్రతీ భక్తుడికి ఉచిత అడ్డూ ప్రసాదం అందించాలని టీటీడీ బోర్డు నిర్ణయం తీసుకుంది. వైకుంఠ ఏకాదశి, ద్వాదశి పర్వదినాల కోసం ముస్తాబయిన తిరుమల దివ్యక్షేత్రం విద్యుత్ దీపాలు, పూలతో అలంకరణలు అలవైకుంఠపురిని తలపిస్తున్నాయి. వైకుంఠ ఏకాదశి, ద్వాదశి పర్వదినాల్లో శ్రీవారిని దర్శించుకుని వైకుంఠ ద్వార ప్రవేశం చేసి పునీతులు కావాలనే భక్తిభావంతో లక్షలాదిగా తిరుమలకు తరలివస్తుంటారు. దీంతో టిటిడి వీరి కోసం విస్తృత ఏర్పాట్లు చేసింది. వేకువజామునే తిరుప్పావై పఠనంతో శ్రీవారిని మేల్కొలిపి, ధనుర్మాసం కైంకర్యాలు, అభిషేకం ఏకాంతంగా నిర్వహించాక దర్శనాలకు అనుమతిస్తారు. ఈలోపు వైకుంఠ ద్వారాలను శాస్త్రోక్తంగా తెరిచి ఉంచుతారు. ఉదయం 5 గంటల అనంతరం ప్రొటోకాల్ పరిధిలోని ప్రముఖులకు వీఐపీ దర్శనం ప్రారంభించి అనంతరం ధర్మదర్శనాన్ని ఆరంభిస్తారు. తిరుమలకు దేశవ్యాప్తంగా పలువురు ప్రముఖులు రానుండడంతో వీరికి దర్శన ఏర్పాట్లు చేశారు. తిరుమలకు అశేష సంఖ్యలో తరలివచ్చే భక్తులకు అన్నపానీయాలు ముమ్మరంగా వితరణ చేయడానికి ఏర్పాట్లు చేసింది. వైకుంఠ ఏకాదశి, ద్వాదశి పర్వదినాలను పురస్కరించుకుని తిరుమలకు భక్తకోటి రాక పెరిగింది. మరోవైపు వైకుంఠ ఏకాదశి, ద్వాదశిని పురస్కరించుకుని శ్రీవారి దర్శనం, వైకుంఠ ద్వార ప్రవేశం కల్పనకు టిటిడి సకల ఏర్పాట్లను చేసింది. పవిత్రత ఉట్టిపడేలా, భక్తులకు అహ్లాదం కలిగించేలా తిరుమలలో పుష్పాలం కరణలు, విద్యుద్దీపాలంకరణలను చేపట్టారు. వైకుంఠ ఏకాదశి, ద్వాదశి పర్వదినాల సందర్భంగా శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వారాలను తెరచి ఉంచనున్నారు. శ్రీవారి దర్శనం చేసుకుని వైకుంఠ ద్వార ప్రదక్షిణ కోసం భక్తకోటి అశేషంగా తిరుమలకు తరలివస్తోంది. రెండు పర్వదినాల్లో తిరుమలకు వచ్చే భక్తులకు ఏరోజుకు ఆరోజే దర్శనం, వైకుంఠ ద్వార ప్రదక్షిణకు అవకాశం కల్పించాలనే లక్ష్యంతో పలు చర్యలు తీసుకుంది. గతం కంటే మెరుగైన సేవలందించే దిశగా గత అనుభవాలతో చర్యలు చేపట్టింది. వైకుంఠ ద్వారాలు తెరిచిన వెంటనే పాసులు పొందిన ప్రొటోకాల్ పరిధిలోని ప్రముఖులకు బ్రేక్ దర్శన అవకాశం కల్పిస్తారు. కరోనా నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## యోగనిద్ర నుంచి శ్రీమహావిష్ణువు మేల్కొన్న రోజు ముక్కోటి దేవులకు దర్శనమిచ్చిన స్వామి



**శ్రీరంగం, డిసెంబర్ 22 (సమ సమాజం):** వైకుంఠ ఏకాదశి రోజు ఉత్తర ద్వార దర్శనం ద్వారా స్వామి దర్శనం చేసుకోవడం ముక్తిమార్గంగా భావిస్తారు. దక్షిణాయణం ప్రారంభంలో వచ్చే తొలి ఏకాదశి నుంచి ముక్కోటి ఏకాదశి వరకూ విష్ణుమూర్తి యోగ నిద్రలో ఉంటాడు. ఆయన వైకుంఠ ఏకాదశి రోజు మేల్కొంటాడు. వైకుంఠ ఏకాదశిని ముక్కోటి ఏకాదశని, స్వర్గద్వార ఏకాదశి అని పిలుస్తారు. ఈ పేర్లు రావడం వెనుక వేర్వేరు కథనాలు పురాణాల్లో కనిపిస్తాయి. యోగనిద్రలో ఉన్న శ్రీమహావిష్ణువు వైకుంఠ ఏకాదశి రోజు మేల్కొంటాడని పురాణ ప్రశస్తి. ఈ రోజే ముక్కోటి దేవతలు వైకుంఠం వెళ్లి శ్రీమహావిష్ణువును సందర్శించు కుంటారని ప్రతీతి. వైకుంఠ ద్వారం నుంచి దర్శనానికి- భక్తులే కాదు, మూడు కోట్లమంది దేవతలూ తహతహలాడతారని చెబుతారు.విష్ణువు కొలువై ఉన్న వైకుంఠ ద్వారాలు ఈరోజు తెరుస్తారని వైకుంఠ ఏకాదశి అంటారు. దక్షిణాయణంలో యోగనిద్రలోకి వెళ్లిన మహావిష్ణువు ఈ రోజునే మేల్కొంటాడని ఆర్యోక్తి. ఆ స్వామిని దర్శించుకోవడానికి ముక్కోటి దేవతలూ వైకుంఠానికి చేరుకుంటారు. అందుకే దీనిని ముక్కోటి ఏకాదశి అని పిలుస్తారు. అందువల్ల దీనికి 'ముక్కోటి' అనే పేరు సార్థకమైంది. ఇలా అనేక ప్రాధాన్యాలూ, విశేషాలూ ఉన్నందువల్ల ఈ రోజును అత్యంత పుణ్యప్రదమైనది, పరమ పవిత్రమైనది, శుభప్రదమైనదిగా భావిస్తారు. ఈ దినం ఏకాదశీ వ్రతం చేసి, శివ కేశవులను పూజించి, ఉపవాస-జాగరణలు పాటిస్తే పుణ్యఫలాలు సంప్రాప్తిస్తాయని విశ్వాసం. విష్ణుపురాణాన్ని అనుసరించి ఈ రోజు ఉపవాసం చేస్తే మూడుకోట్ల ఏకాదశుల ఉపవాస పుణ్యఫలం లభిస్తుందని పండితులు చెపుతారు. ముక్కోటి ఏకాదశి పర్వదినాన దేశ, విదేశాలలోని అన్ని వైష్ణవ దేవాలయాలలో విశేషమైన పూజలు నిర్వహిస్తారు. అందుకే దక్షిణాయణంలో చనిపోయిన పుణ్యాత్ములకు ఈ రోజునే స్వర్గంలోకి ప్రవేశించే అవకాశం కల్పిస్తారు కాబట్టి స్వర్గద్వార ఏకాదశి అని పిలుస్తారని పురాణ కథనాలు. సంవత్సరానికి పన్నెండు నెలలు. నెలకు రెండు పక్షాలు. పక్షానికి ఒక ఏకాదశి. వెరసి ఏడాదికి ఇరవైనాలుగు ఏకాదశులు. ఒక్కో ఏకాదశికీ ఒక్కో పేరుంది. కానీ, వాటిలో వైకుంఠ ఏకాదశి చేరలేదు. దానికి కారణం. ఇతర ఏకాదశులన్నీ చాంద్రమాన గణన ఆధారంగా ఏర్పడినవి. వాటికి భిన్నంగా సౌరమాన గణన ఆధారంగా ఏర్పడిందీ ఏకాదశి. వైకుంఠ ఏకాదశి ధనుర్మాసంలో వస్తుంది. ధనుర్మాసం సూర్య గమనాన్ని బట్టి ఏర్పడుతుంది. మార్గశిరం-పుష్యం ఈ రెండింట్లో ఏదో ఒక మాసంలో వస్తుంది. అదైనా శుక్లపక్షంలో వచ్చే ఏకాదశే వైకుంఠ ఏకాదశి అవుతుంది. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారం గుండా ఆలయంలోకి ప్రవేశించి స్వామిని దర్శించుకోవడం సంప్రదాయంగా వస్తోంది. దీని వెనుకా అనేకమైన కారణాలు ఉన్నాయి. మధుకైటభులనే రాక్షసులు వేదాలను అపహరించుకుపోతుంటే.. వాటిని రక్షించడం కోసం మహావిష్ణువు వైకుంఠం నుంచి ఉత్తర ద్వారం గుండా వెళ్లాడని, మధుకైటభులను సంహరించి తిరిగి ఉత్తర ద్వారం గుండానే వైకుంఠంలోకి ప్రవేశించాడని చెబుతారు. ఆయన నడిచిన ఉత్తర ద్వారం నుంచి స్వామిని దర్శించుకుంటే పుణ్యమని భక్తులు విశ్వసిస్తారు. ముక్కోటి ఏకాదశినాటి విధివిధానాలను, ఏకాదశి వ్రత నియమాలను పాటించినవారికి స్వర్గసుఖప్రాప్తి కలుగుతుందనే విశ్వాసం కారణంగా దీనికి సౌఖ్యద ఏకాదశిగా పేరుంది. మోక్షప్రాప్తినిస్తుందనే అర్థంలో మోక్షద ఏకాదశిగానూ సార్థక నామాలు ఏర్పడ్డాయి. వైఖానసుడు అనే రాజుకు తన తండ్రి నరకంలో యాతన పడుతున్న దృశ్యం కలలో కనిపించిందట. ముక్కోటి ఏకాదశినాడు ఆ రాజు దీక్ష స్వీకరించి, వ్రతం, ఉపవాసాది నియమాలు పాటించడం వల్ల ఆయన తండ్రికి మోక్షప్రాప్తి కలిగిందని పురాణ గాథ. బ్రహ్మ నుదుటి నుంచి అకస్మాత్తుగా ఓ చెమటబొట్టు రాలి పడిందట. దాని నుంచి రాక్షసుడు జన్మించి, తనకో చోటు కల్పించాలని బ్రహ్మను కోరాడట. ఏకాదశినాటి అన్నం మెతుకుల్లో అతడికి బ్రహ్మ చోటు కల్పించాడంటారు. ఆనాటి నుంచి ఏకాదశి తిథిలో ఉపవాస నియమం ఏర్పడిందని పురాణాలు చెబుతున్నాయి. సౌరమానం ప్రకారం ధనుర్మాసంలో వచ్చే శుద్ధ ఏకాదశిని 'వైకుంఠ ఏకాదశి'గా పరిగణిస్తారు. ఈ రోజు వైకుంఠ ద్వారం ద్వారా శ్రీమహావిష్ణువు సర్వాలంకార భూషితుడై, తన దేవేరులతో కలసి దర్శనమిస్తాడని పురాణాలు చెబుతున్నాయి. ఆ అపురూప దర్శనం కోసం దేవతలు ఉత్తర ద్వారం ద్వారా వైకుంఠంలోకి ప్రవేశించి స్వామివారి అనుగ్రహాన్ని పొందుతారని నమ్మకం. అలాగే ఈ రోజున శ్రీమహావిష్ణువు ముక్కోటి దేవతలతో కలిసి భువికి దిగి వస్తాడని ప్రతీతి. అందుకే ఈ ఏకాదశిని ముక్కోటి ఏకాదశి అని కూడా అంటారు. వైష్ణవ సాంప్రదాయంలో ముక్కోటి ఏకాదశికి ఎంతో ప్రాధాన్యం ఉంది.క్షీర సాగర మధన సమయంలో అమృతం, హాలాహలం ఇదే రోజున ఉద్భవించాయన్నది పురాణ కథనం. హాలాహలాన్ని పరమ శివుడు తన కంఠంలో ధరించి లోకాలను కాపాడగా, శ్రీమహావిష్ణువు అమృతాన్ని దేవతలకు అందించి అమరులుగా మారుస్తాడు. అందుకే ముక్కోటి ఏకాదశిని శైవులు, వైష్ణవులు సమాన భక్తిశ్రద్ధలతో జరుపుకొంటారు. పద్మ పురాణం ప్రకారం- 'ముర' అనే రాక్షసి లోకాలను పీడిస్తుంటే, దేవతలు పరమశివుని సలహా ప్రకారం శ్రీ మహా విష్ణువును ఆశ్రయించారు. శ్రీమహావిష్ణువు, హైమవతి అనే స్త్రీ శక్తి ద్వారా ఆ రాక్షసిని సంహరించాడు ఎవరైతే ఈ రోజు తనను అర్చిస్తారో వారికి అంత్యకాలంలో వైకుంఠ ప్రాప్తి కలుగుతుందని వరమిచ్చాడు. అందువల్ల కూడా ఈ రోజును వైకుంఠ ఏకాదశిగా వ్యవహరిస్తారు. ఈ కారణంగా శాక్తేయులకు కూడా ఈ రోజు అత్యంత పవిత్రమైన రోజు. మహాభారత కాలంలో శ్రీకృష్ణార్జుల మధ్య గీతా సంవాదం జరిగినది కూడా ఈ రోజే అంటారు.

# దేవాలయ భూమి కబ్జాకు యత్నం

## రియల్ గుండాలను అడ్డుకున్న స్థానికులు

**హైదరాబాద్, డిసెంబర్ 22 (సమ సమాజం):** రంగారెడ్డి జిల్లా నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధి పోచారం గుట్ట వద్ద శుక్రవారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఓ రియల్ ఎస్టేట్ సంస్థ యాజమాన్యం హనుమాన్ దేవాలయం కబ్జా చేసింది. గమనించిన స్థానికులు అడ్డుకున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం నెలకొంది. కబ్జా కోరులు జేసీబీల తో దేవాలయం భూమిని పదును చేయడానికి పనులు ప్రారంభించారు. స్థానికుల సమాచారంతో రంగ ప్రవేశం చేసిన నార్సింగి పోలీసులు ఇరు వర్గాలను చెదర గొట్టారు. రెండు జేసీబీల సీజ్ చేశారు. గుండాలు, ప్రైవేటు బౌన్సర్లు గతంలో స్థానికులపై రాళ్ల దాడి చేశారని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు.

# ఆర్టీసీకి పెరిగిన మహిళా ప్రయాణికులు




(మొదటి పేజి తరువాయి) ప్రయాణీకులు పెరిగారు. ఈ క్రమంలో పలు రూట్లలో చాలినంత బస్ సర్వీసులు లేక ప్రయాణికుల అనేక ఇబ్బందులు పడుతున్నారు. పలు ప్రాంతాల నుంచి బస్సులు సరిపోవడం లేదని ఫిర్యాదులు కూడా వస్తున్నాయి. దీంతో స్పందించిన టీఎస్ఆర్టీసీ.. అద్దె బస్సులు కావాలని ఓ ప్రకటన విడుదల చేసింది. ఆసక్తి ఉన్న వారు బస్సులను అ÷-దదెకు ఇవ్వొచ్చని సూచించింది. ముఖ్యంగా గ్రేటర్ పరిధిలో మెట్రో ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, సిటీ సబర్బన్, సిటీ మఫిసిల్ బస్సులు కావాలని ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. అసక్తి ఉన్న వారు వెబ్‌సట్ లేదా మొబైల్ నంబర్: 9100998230ను సంప్రదించాలని కోరింది. గ్రేటర్ హైదరాబాద్‌లో నడిపేందుకు అద్దె బస్సుల కోసం దరఖాస్తులను ఆహ్వానించిన టీఎస్ఆర్టీసీ బస్సు నమూనా, కలర్, సీట్లు, తదితర అంశాలతో అద్దె బస్సుల యజమానులు దరఖాస్తు చేసుకోవాలని సూచనలు జారీ చేసింది. కాంగ్రెస్ పార్టీ చేసిన ఆరు గ్యారెంటీల్లో మహాలక్ష్మి పథకం కింద డిసెంబర్ 9వ తేదీన మహిళలకు ఉచిత బస్ ప్రయాణాన్ని ప్రభుత్వం ప్రారంభించిన విషయం తెలిసిందే. మహాలక్ష్మి-ఉచిత బస్సు పథకానికి అనూహ్య స్పందన లభించిందని.. 11 రోజుల్లో 3 కోట్ల మంది మహిళలు ప్రయాణం చేసినట్లు ఆర్టీసి ఎండీ సజ్జనార్ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. ఇక పలు రూట్లలో బస్సులు సరిపోకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడినట్లు సోషల్ మీడియాలో వీడియోలు వైరల్ అయ్యాయి.

# 2024 గగన్‌యాన్‌కు ఇస్రో సంసిద్ధత



(మొదటి పేజీ తరువాయి) మిషన్ ఒకటి నుంచి మూడు రోజులు పడుతుం దని.. వ్యోమగాములు సురక్షితంగా భూమికి తిరిగి రావడానికి కావాల్సిన సిస్టమ్ పై దృష్టి సారించామని ఇస్రో చైర్మన్ సోమ్ నాథ్ తెలిపారు. గగన్‌యాన్ మిషన్ కోసం ఇస్రో తన లైఫ్ సపోర్ట్ సిస్టమ్ టెక్ని అభివృద్ధి చేస్తుందని ఇస్రో చైర్మన్ ఎస్. సోమ్‌నాథ్ వెల్లడించారు. ఇతర దేశాలు తమ రీసెర్చ్ లను పంచుకునేందుకు ఇష్టపడవని చైర్మన్ తెలిపారు. ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనేజేషన్ (ఇస్రో) 2023లో చంద్రయాన్3 తో సహా అనేక సక్సెస్ ఫుల్ అంతరిక్ష ప్రయోగాలతో యూనివర్సల్ హిస్టరీ మేకర్ అయిందని సోమ్ నాథ్ అన్నారు. ఇస్రో చేసిన అంతరిక్ష పరిశోధనలకు ప్రపంచం ప్రశంసలు కురిపించిందన్నారు. ఇస్రో మరో అంతరిక్ష ఫ్లైట్ మిషన్.. గగన్ యాన్.. దీనికోసం లైఫ్ సపోర్ట్ సిస్టమ్ టెక్నాలజీని పంచుకోవ డానికి ఇతర దేశాలు పంచుకోవడానికి సిద్ధంగా లేవన్నారు. అయినప్పటికీ స్వదేశీ ఎన్విరాన్ మెంటల్ కంట్రోల్ లైఫ్ సపోర్ట్ సిస్టమ్ అభివృద్ధి చేస్తున్నందున ఇస్రో ఆశయానికి ఎలాంటి అడ్డంకులు లేవని సోమ్ నాథ్ ప్రకటించారు. ఈ మిషన్ తో భారత్ మరోసారి చరిత్ర సృష్టిస్తుందన్నారు. మనోహర్ పారికర్ విద్యాన్ మహోత్సవ్ 2023లో ఇస్రో చైర్మన్ మాట్లాడుతూ..పర్యావరణ నియంత్రణ, లైఫ్ సపోర్ట్ సిస్టమ్‌ను అభివృద్ధి చేయడంలో మాకు అనుభవం లేదు. రాకెట్లు, ఉపగ్రహాలు మాత్రమే రూపొందిస్తున్నాం..అయితే ఈ సపోర్టు ను ఇతర దేశాలనుంచి ఆశించాం. ఏ ప్రభుత్వమూ క్లిష్టమైన పరిజ్ఞానాన్ని అందించేందుకు సిద్ధంగా లేదు. దశాబ్దాల కాలంగా సహకారం, సాంకేతికత పురోగతి ద్వారా నాసా(అమెరికా), రోస్కోస్మోస్ (రష్యా), ఇఎస్ఎ యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ) వంటి అంతరిక్ష సంస్థలు ఇసిఎల్ఎస్ఎస్ వ్యవస్థల అభివృద్ధికి సహకారాన్ని అందించాయి. అయినప్పటికీ సంబంధిత పరిశోధలను ఇస్రోతో పంచుకోవడంలో వారు విముఖత చూపారని..దీంతో ఇసిఎల్ఎస్ఎస్ వ్యవస్థను స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించాలని ఇస్రో నిర్ణయించింద న్నారు. సాంకేతిక.. అంతరిక్షంలోని అనేక సవాళ్లతో కూడిన వాతావరణంలో వ్యోమగామి మనుగడకు అవసరమైన గాలి నాణ్యత, నీటి సరఫరాను నిర్వహిస్తుంది. యాక్టివేటెడ్ చార్ కోల్ బెడ్లు, ఉత్ప్రేరక ఆక్సిడైజర్లు, మాలిక్యులర్ జల్లెడలతో కూడిన ఖచ్చితమై మెకానిజమ్‌ల ద్వారా ఈ వ్యవస్థ క్యాబిన్ గాలి నాణ్యతను నియంత్రిస్తుంది. సిబ్బందికి శ్వాసక్రియ వాతావరణాన్ని నిర్ధారిస్తుంది.

# గతేడాదికన్నా 2శాతం పెరిగిన నేరాలు



(మొదటి పేజి తరువాయి) నిమజ్జనోత్సవం, మిలాద్ ఉన్ నబీ ఒకేసారి రావడంతో మత పెద్దల సహకారంతో ప్రశాంతంగా నిర్వహించామని చెప్పారు.ఈ ఏడాదిలో మహిళలపై నేరాలు పెరిగాయని సిపి వివరించారు. మహిళలపై అత్యాచార కేసులు 2022లో 343 ఉంటే.. ఈ ఏడాది 403 నమోదయ్యాయన్నారు. సైబర్ నేరాలు 11 శాతం పెరిగాయన్నారు. గతేడాది సైబర్ నేరాల్లో రూ.82 కోట్ల మోసాలు జరిగితే, ఈసారి రూ.133 కోట్లను కేటుగాళ్లు కాజేశారని తెలిపారు. ఆర్థిక నేరాలపై 2022లో 292 కేసులు నమోదైతే.. 2023లో స్వల్పం (344)గా పెరిగాయన్నారు పోక్సో కేసులు 12 శాతానికి తగ్గాయన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు నార్కోటిక్ బ్యూరో తీవ్రంగా కృషి చేస్తోందని చెప్పారు. సరఫరా చేసే వాళ్లు ఎక్కడ ఉన్నా పట్టుకుంటా మని, డ్రగ్స్‌ను గుర్తించేందుకు స్నిపర్ డాగ్స్‌ను వినియోగిస్తామని తెలిపారు. సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే ఫిర్యాదులను వేగంగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో తిరిగి పబ్స్ ఓపెన్ చేయించే ప్రసక్తి ఉండదు అని సిపి స్పష్టం చేశారు. న్యూ ఇయర్ రోజు ఎవరైనా డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తే తగిన చర్యలు తీసుకుంటాని హెచ్చరించారు. రాత్రి ఒంటి గంట వరకు మాత్రమే ఈవెంట్స్, పబ్ లకు అనుమతి ఉందని శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. 12.30 గంటల నుంచే కష్టమర్లను బయటకి పంపాలన్నారు. న్యూ ఇయర్ వేడుకల్లో ఎక్కడైనా డ్రగ్స్ సేవించినా, సప్లై చేసినట్లు తెలిసినా వెంటనే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. న్యూ ఇయర్ వేడుకలపై పోలీసులు ప్రత్యేకంగా నిఘా పెంచుతున్నామన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినంగా వ్యవహరిస్తామని సిపి హెచ్చరించారు. నూతన సంవత్సర వేడుకలను రాత్రి ఒంటి గంటలోపు ఆపేయాలని హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పబ్బులు, బార్లలో డ్రగ్స్ ఉన్నాయని తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు. హైదరాబాద్ కమిషనరేట్‌లో నగర వార్షిక నేర నివేదికను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్ నిర్మూలనకు నార్కొటిక్ బ్యూరో తీవ్రంగా కృషి చేస్తుందని తెలిపారు. . సరఫరా చేసేవాళ్లు ఎక్కడ ఉన్నా వెతికిమరి పట్టికుంటామన్నారు. డ్రగ్స్ గుర్తించేందుకు స్నిఫర్ డాగ్స్‌ను వాడతామని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలు సహా ఈ ఏడాది అన్ని పండుగలు ర్యాలీలను ప్రశాంతంగా నిర్వహించామని హైదరాబాద్ సీపీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కానీ గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది నేరాలు 2 శాతం పెరిగాయని వెల్లడించారు. ఈ ఏడాది 63 శాతం నేరస్తులకు శిక్షలు పడ్డాయని తెలిపారు. 13 కేసుల్లో 13 మందికి జీవిత ఖైదు పడిందన్నారు. ఇక సైబర్ నేరాలు 11 శాతం పెరిగాయని తెలిపారు. సైబర్ నేరాల కారణంగా గత ఏడాది రూ.82 కోట్ల మోసాలు జరిగితే.. ఈసారి రూ.133 కోట్లను కేటుగాళ్లు కాజేశారని తెలిపారు. పోగొట్టుకున్న సొత్తులో 75 శాతం రికవరీ చేశామని చెప్పారు. వివిధ కేసుల్లో జరిగిన నష్టం విలువ రూ.38 కోట్లు ఉంటుందన్నారు. ఈ ఏడాది 79 హత్యలు, 403 రేప్ కేసులు, 242 కిడ్నాప్ కేసులు, 4909 చీటింగ్ కేసులు నమోదయ్యాయని తెలిపారు.

# దేశంలో అరాచక పాలన



(మొదటి పేజి తరువాయి) అన్నారు. పార్లమెంటు భవనంలో దాడిపై వివరణ ఇవ్వాలని అడిగిన 146 మంది ఎంపీలను సస్పెండ్ చేశారని ఈ సందర్భంగా భట్టి విక్రమార్క గుర్తు చేశారు. పార్లమెంటును రక్షించలేని బీజేపీ.. దేశ రక్షణను పూర్తిగా గాలికి వదిలేసిందని విమర్శించారు. అనేక మంది త్యాగాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ప్రస్తుతం దేశంలో అరాచక పాలన సాగుతోందని భట్టి మండిపడ్డారు. పార్లమెంటు ఘటనపై హోంమంత్రి నుంచి ఎలాంటి సమాధానం రావడంలేదని దుయ్యబట్టారు. ఈ ధర్నాలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, రాజకీయ ప్రముఖులు, తదితరలు పాల్గొన్నారు.

# సేవ్ డెమోక్రసీ..




(మొదటి పేజీ తరువాయి) కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్ సహా పలువురు నేతలు ఈ ఆందోళనలో భాగమయ్యారు. ప్రజాస్వామ్య చరిత్రలో ఎక్కడా కూడా 146 మంది ఎంపీలు సస్పెండ్ అయిన పరిస్థితులు లేవు. ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని ప్రజలు తెలుసుకోవాలి. దీనికి ఒక్కటే పరిష్కారం. ఈ ప్రభుత్వాన్ని గద్దె దించి, ఇండియా కూటమిని అధికారంలోకి తేవాలి' అని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీమాట్లాడారు. ఈ సందర్భంగా లోక్‌సభలో చోటుచేసుకున్న భద్రతా వైఫల్యంపై ప్రభుత్వాన్ని విమర్శించారు. అలాగే ఆ ఘటన జరిగిన వెంటనే భాజపా ఎంపీలు సభ నుంచి పారిపోయారని ఎద్దేవా చేశారు. కొందరు యువత పార్లమెంట్‌లో ప్రవేశించి, పొగ వెదజల్లారు. ఆ వెంటనే సభ నుంచి పలువురు భాజపా ఎంపీలు బయటకు పరుగులు తీశారు. ఈ ఘటనలో భద్రతా వైఫల్యం ప్రధాన అంశం. అదే సమయంలో ఆ యువకులు అలా ఎందుకు నిరసన చేశారనేది మనం గమనించాల్సిన మరో అంశం. దేశంలోని నిరుద్యోగమే అందుకు కారణం. ఈ నిరుద్యోగం గురించి మీడియా మాట్లాడదు. కానీ రాహుల్ గాంధీ వీడియో రికార్డు చేస్తున్నారని మాత్రం చర్చిస్తుంది' అని రాహుల్ అసహనం వ్యక్తం చేశారు. ఈ భద్రతా వైఫల్యంపై కేంద్రం సమాధానం చెప్పాలని డిమాండ్ చేసిన విపక్ష ఎంపీలు సస్పెండ్ అయిన సంగతి తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు నుంచి పాఠాలు నేర్చుకున్నామని చెప్పారు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో పార్టీ నేతలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఎంపీ సస్పెన్షన్ విషయమై లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ ఛైర్మన్‌పై పరోక్ష విమర్శలు గుప్పించారు ఖర్గే. ఎంపీలను రక్షించే బాధ్యతల్లో ఉన్నవారే రాజ్యాంగ విధులను నిర్వర్తించడంలో విఫలమయ్యారని ఆరోపించారు కాంగ్రెస్? అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే. పార్లమెంట్? ఉభయ సభల నుంచి విపక్ష ఎంపీలను సస్పెండ్ చేసిన నేపథ్యంలో స్పీకర్?, రాజ్యసభ ఛైర్మన్?పై ఆయన పరోక్ష విమర్శలు చేశారు. దిల్లీలో గురువారం జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో పార్టీ నేతలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు నుంచి పాఠాలు నేర్చుకున్నామని చెప్పారు. త్వరలో జరగబోయే 2024 సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం కావాలని కార్యకర్తలకు సూచించారు. ఫలితాలు ప్రతికూలంగా వచ్చినా, ఓటు షేర్? పెరగడం లాంటివి కొన్ని సానుకూలంగా జరిగాయని తెలిపారు. "ప్రజాస్వామ్యాన్ని బీజేపీ ఎలా ధ్వంసం చేస్తుందో దేశం మొత్తం చూస్తోంది. కీలకమైన బిల్లులను ఎలాంటి చర్చలు లేకుండానే ఆమోదించుకుంటోంది. పార్లమెంట్?ను అధికార పార్టీ వేదికగా మార్చుకునేందుకు కుట్రలు పన్నుతున్నారు. రాజ్యాంగ పదవులు పొందిన వారు కుల, ప్రాంత రాజకీయాలు చేస్తున్నారు. ఇటీవల వచ్చిన అసెంబ్లీ ఫలితాలు నిరాశకు గురిచేశాయి. వాటిని విశ్లేషించుకుంటాం. మళ్లీ అవి జరగకుండా చూసుకుంటాం. లోక్?సభ ఎన్నికలు ఎంతో దూరంలో లేవు. కార్యకర్తలు, నేతలందరూ కార్యాచరణ ప్రారంభించాలి. రాహుల్? గాంధీ మరో విడత భారత్? జోడో యాత్ర తూర్పు నుంచి పశ్చిమానికి చేయాలని అనేక మంది నేతలు కోరారు. దీనిపై అంతిమ నిర్ణయం ఆయన చేతుల్లోనే ఉందని అన్నారు. సీట్ల సర్దుబాటుపై వెంటనే చర్చలు ప్రారంభించాలని విపక్ష కూటమి ఇండియా నాలుగో సమావేశంలో ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్నామని మల్లిఖార్జున ఖర్గే చెప్పారు. ఇందుకోసం కాంగ్రెస్? ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసిందని వెల్లడించారు. ఈ కమిటీ వివిధ రాష్ట్రాల్లోని పార్టీలను కలిసి సీట్ల సర్దుబాటుపై చర్చిస్తుందని వివరించారు. సార్వత్రిక ఎన్నికల వ్యూహాలు, సీట్ల సర్దుబాటుపై చర్చలోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ఇండియా కూటమి పార్టీలతో సీట్ల సర్దుబాటు తదితర విషయాలపై చర్చించేందుకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ దిల్లీలో సమావేశమైంది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన ప్రధాన కార్యాలయంలో ఈ భేటీ జరిగింది. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ, మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ముఖ్య నాయకురాలు ప్రియాంక గాంధీ, సభ్యులు సమావేశానికి హాజరయ్యారు. ఇటీవల వెలువడిన మూడు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్‌కు నిరాశ ఎదురుకావడం వల్ల అక్కడ తాము కీలక అస్త్రాలుగా భావించి ప్రచారానికి వెళ్లిన అంశాలపై మరోసారి విశ్లేషించుకున్నారు. కుల గణన, అదానీ వ్యవహారం వంటి అంశాలతో మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లో ఎన్నికల బరిలోకి దిగినప్పటికీ అవి అంతగా పనిచేయలేదని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తున్నట్టు సమాచారం. దీంతో రానున్న లోక్‌సభ ఎన్నికల్లో అధికార బీజేపీని ఢీకొట్టేందుకు కొత్త అజెండాతో కాంగ్రెస్ ముందుకు వెళ్లనుందని సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది.

# రాహుల్ గాంధీపై చర్యలు తీసుకోండి



(మొదటి పేజి తరువాయి) సరికాదని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విషయంపై ఎన్నికల సంఘం ఇప్పటికే నోటీసులు జారీ చేసిన విషయాన్ని గుర్తు చేసిన హైకోర్టు- ఎనిమిది వారాల్లో దీనిపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. నవంబర్ 22న ఎన్నికల ప్రచారం సందర్భంగా మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా దిల్లీ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. రాజకీయ నాయకులు అలాంటి వ్యాఖ్యలు చేయకుండా మార్గదర్శకాలు రూపొందించేలా ఆదేశాలు జారీ చేయాలని పిటిషనర్ భరత్ నగర్ కోరారు. మోదీని కించపరచడం సహా అత్తున్నత హోదాలో ఉన్న వ్యక్తులపై సంచలన ఆరోపణలు చేయడాన్ని తప్పుబట్టారు. కాగా, రాహుల్ చేసిన వ్యాఖ్యలపై నవంబర్ 23నే ఎన్నికల సంఘం ఆయనకు నోటీసులు జారీ చేసింది. అయితే, రాహుల్ నుంచి ఇంత వరకు వివరణ రాలేదని ఈ కేసుపై విచారణ జరిపిన దిల్లీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్, న్యాయమూర్తి జస్టిస్ మినీ పుష్కర్ణ బెంచ్ పేర్కొంది. 'ఎన్నికల సంఘం ఈ అంశాన్ని పరిశీలిస్తోంది. రాహుల్ గాంధీకి నోటీసులు కూడా జారీ చేసింది. నోటీసులకు సమాధానం చెప్పేందుకు డెడ్?లైన్ ముగిసింది. ఇప్పటివరకు ఎలాంటి వివరణ రాలేదు. కాబట్టి ఈ విషయంపై 8 వారాల్లోగా చర్యలు తీసుకోవాలని ఈసీని ఆదేశిస్తున్నాం' అని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఐదు రాష్ట్రాల ఎన్నికల సమయంలో నవంబర్ 22న రాజస్థాన్?లో పర్యటించిన రాహుల్ గాంధీ ప్రధానిని లక్ష్యంగా చేసుకొని తీవ్ర విమర్శలు చేశారు. మోదీని పనౌతీ (అశుభం)గా అభివర్ణించారు. ప్రపంచకప్? ఫైనల్?లో భారత్ ఓటమికి మోదీ కారణమంటూ పరోక్షంగా వ్యాఖ్యానించారు. ప్రజల సొమ్మును అదానీ కాజేస్తుంటే మోదీ వారి దృష్టిని మళ్లిస్తున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా జేబు దొంగ అంటూ వ్యాఖ్యలు చేశారు. దీనిపై బీజేపీ నేతల ఫిర్యాదు మేరకు ఈసీ షోకాజ్ నోటీసు జారీ చేసింది.

# పెండింగ్ చలాన్లపై రాయితీ ప్రకటన



**హైదరాబాద్, డిసెంబర్ 22 (సమ సమాజం):** వాహనదారులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. పెండింగ్ చలాన్లపై రాయితీని ప్రకటించింది. టూవీలర్ పై 80 శాతం, ఫోర్ వీలర్స్, ఆటోలపై 60 శాతం, భారీ వాహనాలపై 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపింది. అలాగే, ఆర్టీసీ బస్సులు, తోపుడు బళ్లపై 90 శాతం రాయితీ ఇచ్చింది. ఈ నెల 30 నుంచి రాయితీ పొందవచ్చు. రూ. 2 కోట్లకు పైగా పెండింగ్ చలాన్లు ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం రాయితీ కల్పించాలని నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ నిర్ణయంతో వాహన దారులు సంతోషం వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సులు, తోపుడు బండ్లపై 90 శాతం రాయితీ, టూ వీలర్స్‌పై 80 శాతం, ఆటోలు, ఫోర్ వీలర్‌పై 60 శాతం రాయితీ, భారీ వాహనాలపై 50 శాతం రాయితీ కల్పించ నున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ నెల 26వ తేదీ నుంచి వాహనదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. 2022, ఫిబ్రవరి నెలలో పెండింగ్ చలాన్లపై నాటి ప్రభుత్వం రాయితీ కల్పించిన సంగతి తెలిసిందే. రెండు, మూడు చక్రాల వాహనాలకు 75 శాతం, ఆర్టీసీ బస్సులకు 70 శాతం, లైట్, హెవీ మోటారు వాహనాలకు 50 శాతం, తోపుడు బండ్లకు 75 శాతం రాయితీ ఇచ్చారు. నాడు రూ. 300 కోట్ల వరకు పెండింగ్ చలాన్లపై వసూళ్లు అయ్యాయి.

Edited, Printed, Published & owned by *GOSUKONDA PRUDHVIRAJU*, Published From, Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, TELANGANA, Printed at *Panidhar PUBLICATIONS.* Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, ***Editor: GOSUKONDA PRUDHVIRAJU***,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in